రెండో రోజూ జలదిగ్బంధం

ఉండి: రెండో రోజూ ఎడతెరిపి లేని వర్షంతో అటు రైతులు, ఇటు ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఉండి మండలంలో ఎడతెరిపి లేకుండా ఉదయం నుంచి కురిసిన వర్షానికి నారుమడులు, నాట్లు వేసిన వరిచేలు అక్కడా ఇక్కడా అని తేడా లేకుండా మండలంలోని 19 గ్రామాల్లోనూ నీట మునిగాయి. అయితే పరిస్థితి ఇక్కడితోనే ఆగిపోతే అటు నారుమడులు, ఇటు నాట్లు వేసిన వరిచేలను కాపాడుకోవచ్చంటూ రైతులు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. శుక్రవారం రాత్రి వరకు ఎక్కడా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో రైతులు వరిపంటపై ఆశ వదులు కోవాల్సిందేనేమో అంటూ ఆందోళనలో ఉన్నారు.రైతులు ఇప్పటికే నారు వేయడం నుండి నాట్లు వేయడం వరకు ఎకరాకు సుమారుగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు చేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. శుక్రవారంతో వర్షం ఆగిపోతే పరవాలేదు. శనివారం కూడా కురిస్తే మాత్రం వరిచేలు, నారుమడులు పూర్తిగా దెబ్బ తింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోనూ పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది. శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి డ్రెయిన్‌లు సరైన స్థితిలో లేకపోవడంతో సీసీ రోడ్లు నీట మునిగాయి. అలాగే వర్షం వస్తే చాలు నేనే మునిగేందుకు ముందుంటాను అన్నట్టు ఉండి బస్టాండ్ ప్రస్తుతం నీట మునిగింది. ప్రయాణికులు బస్టాండ్‌కు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌ను ముంపు నుంచి కాపాడి ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలంటూ ప్రయాణికులు కోరుకుంటున్నారు.


ఉండిలో ముంపుకు గురైన వరిపొలాలు


పాలకోడేరు మండలం గరగపర్రులో నీట మునిగిన వరిచేలు


ఉండిలో ఉధృతంగా ప్రవహిస్తున్న బొండాడ డ్రెయిన్


నీట మునిగిన ఉండి బస్టాండ్

నీట మునిగిన వరి చేలు

పాలకోడేరు: అల్ప పీడన ప్రభావం కారణంగా మండలంలో గురువారం మొదలైన వర్షం రెండో రోజు శుక్రవారం కూడా కురుస్తూనే ఉంది. దీంతో జన జీవనం స్తంభించింది. ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. రహదారులు కాలువలను తలపిస్తున్నాయి.వ్యాపారాలు మూసేసారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కాళ్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి తెలిపారు. మిషన్ శక్తి 100 డేస్ స్పెషల్ అవేర్‌నెస్ కార్యక్రమం ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కాళ్ల హైస్కూల్ నందు అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్ శక్తి 100 డేస్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు జాగ్రత్తగా ఉండాలి

పాలకోడేరు: సమాజంలో ఆడపిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియాలో చాటింగ్‌లు చేయకూడదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి ఉద్బోధించారు. శుక్రవారం శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి వంద రోజుల ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో అధికారులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసుకోవడం వలన కలిగే అనర్థాలను వివరించారు. 18 సంవత్సరాలు దాటితేనే పెళ్లి చేసుకోవాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు సత్యవాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, తులసి, మణి, జ్యోతి, వెంకటలక్ష్మి, ఝాన్సీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

భీమవరం అర్బన్: బాల్య వివాహాలు చేసినా, మహిళలను వేధించినా వారిపై దాడులు చేసిన చట్టరీత్యా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని పారా మెడికల్ కార్యకర్త జి. దీప్తి, అంగన్ వాడీ సూపర్‌వైజర్ కె. సరళ హెచ్చరించారు. భీమవరం మండలంలోని తుందుర్రులో అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం మిషన్ శక్తి పథకంపై మహిళలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దీప్తి, సరళ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే వారిపై కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఎస్ కనకదుర్గ, ఐ కాశి,అన్నపూర్ణ, ఎమ్ వజ్రకుమారి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ధైర్యంగా ఎదుర్కొవాలి

వీరవాసరం: బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్య, సామాజిక సమస్యలను ధైర్యంగా ఎదుర్కొవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.కే లక్ష్మీకాంతం తెలిపారు. వీరవాసరం మండలం పెర్కిపాలెం 2అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిమాణాలను ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకొని వాటిని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం సూర్యప్రభ, సూపర్ వైజర్ కనకమహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జి.వరలక్ష్మి, వై పెద్దింట్లమ్మ, లక్ష్మీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ శక్తిపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): మిషన్ శక్తి 100 రోజుల అవగాహనా కార్యక్రామాల్లో భాగంగా భీమవరం అర్బన్ పరిధిలో స్థానిక 36వ వార్డు పరిధిలో గల రామరాజు తోట అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహనా కార్యమాలు నిర్వహించారు. బాల్య వివాహాలు, గృహ హింస, రక్త హీనత మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. ఈకార్యక్రమంలో భీమవరం ఐసిడియస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ పి.సరోజినీ, ఏఎన్ఎం సులోచన అంగన్‌వాడీ కార్యకర్త ఎం.వెంకటేశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది


తుందుర్రు అంగన్‌వాడీ సెంటర్‌లో మాట్లాడుతున్న దీప్తి, సరళ


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

భీమవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు అన్నారు. కళాశాల వ్యవస్థాపకుడు సాగి రామకృష్ణంరాజు 91వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. కళాశాల విద్యార్థులు ప్రతి ఏటా వివిధ సందర్భాలను పురస్కరించుకొని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాల, భీమవరం ఆనంద బ్లెడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థుల నుంచి 100 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ చైతన్య చెప్పారు. ఈ కార్యక్రమంలో పి కృష్ణంరాజు, గోకరాజు రామరాజు, ఎస్‌వీ రంగరాజు, సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, ఎం జగపతిరాజు, కెవి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడం అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఆర్‌కేఆర్ విద్యనభ్యసించి విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న అలుమిని విద్యార్థులు కళాశాల విద్యార్థులకు తమవంతు సహకారం అందజేయడం అభినందనీయమన్నారు. కళాశాల అధ్యక్షుడు సాగిప్రసాదరాజు, సెక్రెటరీ అండ్ కర్సపాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ మాట్లాడుతూ తమ కళాశాలలో నిరంతరం అధ్యాపకులు, విద్యార్థులకు నూతన టెక్నాలజీని అందించే విధంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు డీగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ ఉపాధ్యక్షుడు పి కృష్ణంరాజు, సాగి విఠల్‌రంగరాజు, సాగి సత్యప్రతివర్మ, ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య తదితరులు

మడులలో కుళ్లుతున్న వరినారు

ఆకివీడు: భారీ వర్షాలకు నీట మునిగిన నారుమడులలో నీరు నిలబడిపోయి నారు కుళ్లిపోతుంది. ఎడతెరిపిలేని వర్షాలకు చేలల్లో నీరు అధికంగా నిలబడింది. డ్రెయిన్లు, పంట కాలువల్లో నీటి మట్టం పెరగడంతో పొలాల్లోని నీరు బయటకు పోయే మార్గం కన్పించడం లేదు. దీంతో చిరు దశలో ఉన్న నారు మడులలోని ఆకులు కుళ్లిపోతున్నాయి. మండలంలో 4,300 ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు అవసరమైన 220 ఎకరాల నారుమడులకు గాను 201 ఎకరాల్లో నారు మడులు వేశారు. భారీ వర్షాలకు 31 ఎకరాల్లో నారుమడులు నీట మునిగాయి. నీట మునిగిన నారు పైకి పచ్చగా కన్పిస్తున్నా అడుగు భాగంలో కుళ్లిపోతుంది. చేలల్లో నీరు ఇదే విధంగా మరో రెండు మూడు రోజులు నిలబడి ఉంటే నారు పనికి రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా నారు మడులు, నాట్లు వేసిన పొలాలను పరిశీలించేందుకు మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో నీట మునిగిన నారుమడులలో నీటిని బయటకు తోడి నారును రక్షించుకోవాలని సూచించారు.

ప్రమాదకరంగా కాజ్‌వే వంతెన

ఉండి: రెండు రోజుల నుంచి కుస్తున్న భారీ వర్షాలకు యండగండి కాజ్‌వే ప్రమాకరంగా మారింది.కాజ్‌వేపై నుంచి యనమదుర్రు మేజర్ డ్రెయిన్ ప్రవహిస్తుండటంతో ఉండి మండలంలోని యండగండి నుంచి గణపవరం మండలం ఎస్.కొండేపాడు మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అయితే శుక్రవారం మధ్యాహ్నానికి కాజ్‌వేపై ఓ మోస్తరు నీరు ప్రవహిస్తుండగా పైనుంచి వరద ఉధృతి పెరగడంతో కాజ్‌వేపై నీటిమట్టం పెరుగుతుంది. దీంతో యండగండి, ఎస్.కొండేపాడు మీదుగా అత్తిలి, తణుకు తదితర ప్రాంతాలకు దగ్గర మార్గం కావడంతో చాలా మంది ఇదే దారిలో ప్రయాణిస్తూ ఉంటారు. కానీ వరద ఉధృతి పెరగడంతో అటుగా వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది తలెత్తింది. ఈ రహదారిపై ప్రయాణించొద్దంటూ స్థానికులు బెబుతున్నారు. మండలంలోని బొండాడ మేజర్ డ్రెయిన్, యనమదుర్రు మేజర్ డ్రెయిన్ భారీ వర్షాలకు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున బొండాడ డ్రెయిన్ అధికారులు డీఈ సత్యనారాయణ, ఏఈ ఫణిశర్మ తదితర అధికారులు, సిబ్బంది గట్లను పరిశీలించారు. అలాగే గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించి పటిష్ట చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. యనమదుర్రు డ్రెయిన్ రెండవ ప్రమాద హెచ్చరిక చేయడంతో చుట్టు పక్కల వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

ఐటీఐ రెండో విడత దరఖాస్తులకు ఆహ్వానం

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ, 16 ప్రైవేట్ ఐటీఐలలో మిగిలిన సీట్లకు రెండో విడత ప్రవేశాలకు జిల్లాలో ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు దరఖాస్తునకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకొని రసీదు పొందాలన్నారు. 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సరిఫికేషన్ వెరిఫికేషన్ చేయించుకొనని వారు కౌన్సిలింగ్‌కు అనర్హులని తెలిపారు. కౌన్సిలింగ్ సమయంలో రసీదు చూపించిన వారే అర్హులని తెలిపారు. వివరాలకు 08816-297093, 9676099988 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

అమ్మవార్లకు ఆషాఢ సారె


ఆషాఢ సారె సమర్పిస్తున్న మహిళలు

ఆకివీడు: అమ్మవార్లకు ఆషాఢ మాసంలో సారె సమర్పిస్తే గ్రామ దేవతలైన ఆడపడుచులు శాంతించి, సుఖ సంతోషాలు అందజేస్తారని భక్తుల నమ్మికని అర్చకులు లంక జల దుర్గా ప్రసాద్ అన్నారు. స్థానిక మాదివాడలోని భ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి, అలివేలుమంగ, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్లకు శివ శక్తి భజన మండలి మహిళలు శుక్రవారం సారె సమర్పించారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ


ప్రభుత్వాసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న భాను నాయక్

కాళ్ల: ప్రభుత్వాసుపత్రిని అదనపు డీఎంహెచ్‌వో భాను నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి పలు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలోని ప్రసవాలు తీరును పరిశీలించారు. ఎంఎల్ హెచ్‌పీలు వాటర్ టెస్టింగ్ చేయాలని సూచించారు. ఆశ కార్యకర్తలు తప్పనిసరిగా ఫీవర్ సర్వే, ఎల్‌సీడీసీ సర్వే చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సరాబు సునీల్, సిబ్బంది ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఉండి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని యండగండి వినియోగదారుల సంఘం ప్రతినిధి పీవీఎస్ గోపాలకృష్ణంరాజు శుక్రవారం పత్రికా ప్రకటనలో కోరారు. యండగండి, ఉప్పులూరు గ్రామాలతో పాటు పలు ప్రాంతాల్లో నీట మునిగిన వరిచేలు, నారుమడులను కాపాడేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన డ్రెయిన్లలో గుర్రపు డెక్క, చెత్తా చెదారాలను తొలగించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. అలాగే రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని కోరారు.

ముంపు ప్రాంతాల పరిశీలన


మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: పట్టణంలో వర్షాలు కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) శుక్రవారం పరిశీలించారు. యనమదుర్రు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తున్నందు డ్రెయిన్ వెంబడీ ఉన్న మెంటేవారితోట పరిసర ప్రాంతాలకు ముంపు పొంచి ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ ఎం శ్యామల, కోళ్ల నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఊటీ కలెక్టర్‌గా భీమవరం వాసి లక్ష్మీభవ్య


లక్ష్మీభవ్య

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన సుంకర లక్ష్మీభవ్య తమిళనాడు రాష్ట్రంలోని నిల్గిరీస్ (ఊటీ) జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. పట్టణానికి చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ దివంగత సుంకర బాల పరమేశ్వరరావు మనుమడైన సుంకర రాజగోపాల్ తమిళనాడులోని ఈరోడ్ జిల్లా కలెక్టర్ పనిచేస్తుండగా ఆయన సతీమణి లక్ష్మీభవ్య ఊటీ కలెక్టర్ కావడం విశేషం. లక్ష్మీభవ్య భీమవరం పట్టణంలోని విష్ణు ఇంజనీరింగ్ కాలేజీలో విద్యనభ్యసించగా 2015లో 88వ ర్యాంక్‌తో ఐఏఎస్‌గా సెలెక్ట్‌టై ముందుగా వెస్ట్ బెంగాల్‌లో సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు అనంతరం తమిళనాడు లో కమర్షియల్ టాక్సస్ జాయింట్ కమిషనర్‌గా పని చేస్తూ ఊటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

నారుమడులలో వర్షపు నీటిని బయటకు తొలగించాలి


రాయలంలో వరి చేలను పరిశీలిస్తున్న ఏఓ

భీమవరం అర్బన్: అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు నారుమడులలో నిలిచిపోయిన వర్షపు నీటిని తొలగించాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని రాయలం, యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి గ్రామాలలో శుక్రవారం నారుమడులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడుల చుట్టూ గట్లు ఎత్తుగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన సదస్సు

నూతన సాంకేతికతతో మహిళాభివృద్ధి


డ్రోన్ల వినియోగాన్ని వివరిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

ఆకివీడు: డ్వాక్రా గ్రూపుల ఆదాయాభివృద్ధికి డ్రోన్ల వినియోగం దోహదపడుతుందని డీఆర్‌డీఏ పీడీ పి.వేణుగోపాల్ చెప్పారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో గురువారం డ్రోన్ల వినియోగంపై డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నైపుణ్యాభివృద్ధి సంస్థ, బైరాజు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు నూతన సాంకేతిక పద్ధతిని పాటించాలన్నారు. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే డ్రోన్లను కేంద్ర ప్రభుత్వం 80 శాతం సబ్సీడీపై అందజేస్తుందని తెలిపారు. వ్యవసాయం, హార్టీకల్చర్, ఆక్వా కల్చర్ తదితర వాటిలో మందుల పిచికారీకి డ్రోన్లు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. నైపుణ్యాభివృద్ధిసంస్థ డీప్యూటీ డైరెక్టర్ పి.చంద్రమౌళి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు మహిళలు సాంకేతిక నైపుణ్యంతో ఆర్థిక పరిపుష్టి పొందాలని సూచించారు. మిగిలిన రూ.2 లక్షలు బ్యాంక్ సమకూర్చుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్లెం అరుణ కుమారి, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి అన్నెపురెడ్డి కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ భానుమూర్తి, ఏపీఎం జె.నాగభూషణం నాయుడు పాల్గొన్నారు.

రహదారి గుంతల మయం


రహదారిపై ఏర్పడిన గుంతలు

కాళ్ల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్ర రహదారిపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. భీమవరం నుంచి విజయవాడ వైపు వెళ్లే రాష్ట్ర రహదారిపై గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రాష్ట్ర రహదారిపై కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద, దొడ్డనపూడి, కాళ్లకూరు గ్రామాల సమీపంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గుంతల్లో వర్షపు నీరు నిలబడి గుంతలు కనపడక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలు సంభవిస్తాయని భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదాలు సంభవించక ముందే అధికారులు స్పందించి గోతుల్లో వర్షపు నీటిని మళ్లించి, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.